క్లుప్తంగా

ఉపాధి పనులు వేగవంతం చేయాలి

చాగల్లు: ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో ఎస్.బుజ్జి సూచించారు. ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో చేస్తున్న పనులపై ఫీల్డ్ అసిస్టెంట్లతో మంగళవారం ఆమె సమీక్ష జరిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఈ సమీక్షలో ఎంపీడీవో మాట్లాడుతూ గతంలో మొదలు పెట్టి అసంపూర్తిగా ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. చేసిన పనుల కొలతలు, కూలీల హాజరు నమోదు కచ్చితంగా ఉండాలని పేర్కొన్నారు. ఉపాధి పనులు కావలసిన కూలీలు అయా గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లను కలవాలని ఈ సందర్భంగా ఎంపీడీవో సూచించారు. టెక్నికల్ అసిస్టెంట్ భాస్కర్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

పచ్చిరొట్ట సాగుతో భూమి సారవంతం

నిడదవోలు రూరల్: పచ్చిరొట్ట సాగుతో భూమి సారవంతం అవుతుందని మండల వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ అన్నారు. మండలంలోని సమిశ్రగూడెం, డి.ముప్పవరం గ్రామాల్లో ఖరీఫ్ సాగులో రైతులు తీసుకోవాల్సిన చర్యలపై మంగళవారం అవగాహన కల్పించారు. జీలుగు సాగు వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఖరీఫ్ సాగుకు ముందు చేలో పెరిగిన జీలుగును కలిపి దున్నితే నేలలో సారం పెరుగుతుందన్నారు. నేలకు నత్రజని, ఫాస్ఫేట్ అందుతాయని చెప్పారు. రసాయన ఎరువుల వాడకాన్ని కూడా 15 శాతం తగ్గిస్తుందన్నారు. ఆకుమడులు పూర్తి చేయడంతో పాటు లైసెన్స్ పొందిన డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలని ఆయన సూచించారు.

ఘనంగా ఐశ్వర్య సుందరేశ్వర స్వామి వార్షికోత్సవం



చిలకపాడులో ప్రత్యేక అలంకరణలో ఐశ్వర్య సుందరేశ్వరస్వామి

ఉండ్రాజవరం: మండలంలో చిలకపాడు గ్రామంలోని ఐశ్వర్య సుందరేశ్వర స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అర్చకుడు ఫణీశర్మ ఆధ్వర్యంలో పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయం వద్ద అన్నసమారాధన జరిగింది. ఆలయ ధర్మకర్తలు, గ్రామస్తుల సహకారంతో సోమవారం రాత్రి స్వామివారి కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారి కల్యాణాన్ని వీక్షించి, స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ప్రక్కిలంకలో విశ్వేశ్వర స్వామి దివ్య కల్యాణం



ప్రక్కిలంక విశ్వేశ్వర స్వామివారు

తాళ్లపూడి: ప్రక్కిలంక గ్రామంలోని అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి వారి ఆలయంలో స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని పలు రకాల పుష్పాలతో అలంకరించారు. ఆలయ అర్చకుడు కొతవరపు విశ్వనాథ శర్మ ఆధ్వర్యంలో రెండు రోజులుగా సాయంత్రం ఆరు గంటలకు స్వామి, అమ్మవార్ల వార్షిక కల్యాణ మహోత్సవం నిర్వహించారు. వారం రోజుల పాటు జరిగే ఈ దివ్య కల్యాణ మహోత్సవంలో భక్తులు పాల్గొనాలని అర్చకుడు విశ్వనాథశర్మ తెలిపారు.

రోగులకు భోజనం పొట్లాల పంపిణీ



భోజన పొట్లాలు పంపిణీ చేస్తున్న రోటరీ సభ్యులు

నిడదవోలు: రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలోని రోగులకు ఉచితంగా భోజన పొట్లాలు పంపిణీ చేశారు. ఇందుకు శ్రీసత్యసాయి సేవా సంస్థలు ఆర్థిక సహకారం అందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యకుడు కీర్తి ఆంజనేయులు, గుంటిపల్లి శివకుమార్, కాళ్ళ రాంబాబు, గొన్నాబత్తుల రామారావు, పొన్నా సుబ్రహ్మణ్యశర్మ , గోపిరెడ్డి శ్రీనివాస్, గాజుల రంగారావు, శ్రీకంఠయ్య, గంగుమళ్ల హనుమంతరావు, ఖండవిల్లి గోపాలస్వామి, ఖండవిల్లి రంగాచార్యులు, బలగం అప్పారావు, బొజ్జా పాపారావు తదితరులు పాల్గొన్నారు.

విష సర్పం.. రైతన్నా జరభద్రం

- ఖరీఫ్ సీజన్‌లో అన్నదాతలకు పొంచి ఉన్న ప్రమాదం
- పాము కరిస్తే నాటు వైద్యం వద్దు
- విధిగా వైద్యుడిని సంప్రదించాలి
- అందుబాటులో యాంటీ స్నేక్ వీనం ఇంజక్షన్లు



తాచుపాము

నిడదవోలు: పాముకు మనిషిని చూస్తే భయం.. మనిషికి పాముని చూస్తే దడ.. ఈ భయంతోనే మనిషిని చూస్తే పాము కాటేస్తుంది. ఖరీఫ్ సీజన్ మొదలైంది. రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. దాంతో పాటు విష సర్పాల బెడదా ఎక్కువే. వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులు, కూలీలు పాముకాటుకు గురై ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు గతంలో ఎన్నో ఉన్నాయి. గోదావరి డెల్టాల పరిధిలో జూన్ నుంచి సెప్టెంబర్ వరకూ ఖరీఫ్ వ్యవసాయ పనులు జోరుగా సాగుతాయి. రైతులు నిత్యం పొలం గట్లపై తిరుగుతుంటారు. పచ్చని పచ్చిక మాటున పాములు సంచారం ఎక్కువగా ఉంటుంది. రైతులు అడుగు వేసేటపుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ఒకవేళ పాము కాటుకు గురైనా మెళకువతో ధైర్యంగా వ్యవహరిస్తే ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చు.

ఇదీ పరిస్థితి

ఇప్పటికే వర్షాలు కురవడంతో పొలాల్లోని బొరియల్లో ఉండే విష పురుగులు, పాములు బయటకు వస్తుంటాయి. వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యే రైతులకు, కూలీలకు వాటి వల్ల ముప్పు పొంచి ఉంది. పొలాల్లో పాము కాటుకు గురై రైతులు, కూలీలు ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు అనేకం ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లాలోని ప్రభుత్వాసుపత్రిల్లో 2019 నుంచి ఇప్పటి వరకు 532 పాము కాటు కేసులు నమోదైనట్టు అధికారులు తెలిపారు. పాము కరిచాక, సకాలంలో వైద్యం అందకపోతే మృత్యువాత పడుతుంటారు. పాముకాటు బారిన పడకుండా రైతులు, కూలీలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో పరిశీలిద్దాం.

రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- పొలాలకు వెళ్లే రైతులు విధిగా చేతికర్ర వెంట తీసుకువెళ్లాలి. గట్లపై నడిచేటపుడు కర్రతో నేలతో చప్పుడు చేస్తూ వెళితే సమీపంలో పాములు ఉంటే వాటికవే పక్కకు తప్పుకుంటాయి.
- ధాన్యపు గాదెలు, గడ్డి వాములు, తడిగా ఉండే చోట కప్పలు, ఎలకల కోసం పాములు తిరుగుతుంటాయి. దుంగలు, కట్టెలు, పచ్చిక బయళ్లలో కూడా పాముల సంచారం ఎక్కువ. ఈ ప్రాంతాల్లో తిరిగేటపుడు రైతులు, కూలీలు అప్రమత్తంగా ఉండాలి.
- రాత్రి పూట పొలాలకు వెళ్లాల్సి వస్తే విధిగా టార్చిలైట్ తీసుకెళ్లాలి. నివాస గృహాల పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి. వ్యర్థాలు, ముళ్ల పొదలు ఉండకూడదు. గోడల వారన బొరియలు, కట్టెల్లో పాములు నక్కే అవకాశం ఉంది.

పాము కాటు లక్షణాలు

పాము కాటుకు గురైన వారు ఆందోళన చెందాల్సిన పని లేదని వైద్యులు చెబుతున్నారు. ఆందోళన చెందితే గుండెపోటు వచ్చే అవకాశాలున్నాయని అంటున్నారు. సాధారణంగా విషం ఉన్న పాము కాటు వేసిన చోట రెండు కోరల గాయం స్పష్టంగా కనిపిస్తుంది. నొప్పి తట్టుకోలేకపోతారు. నొప్పి క్రమంగా పైకి వ్యాపిస్తూ తిమ్మిరిగా అనిపిస్తుంది. గొంతు కండరాలు బిగుసుకున్నట్టు, నాలుక మందమైనట్లు, గొంతులో ఏదీ దిగని పరిస్థితిలో ఉంటారు. దొంగ కారడంతో పాటు శరీరం మత్తుగా ఉంటుంది. కళ్లు మగతగా ఉంటాయి.



యాంటీ వీనం (పాముకాటు విరుగుడు ఇంజక్షన్)

విషం కన్నా భయంతోనే

పాము విషం కన్నా చాలామంది పాము కాటేసిందన్న భయంతోనే ప్రాణం మీదకు తెచ్చుకుంటున్నారు. పాము కాటుకు గురైనా వ్యక్తికి ధైర్యం చెప్పాలి. వాస్తవానికి చాలా పాములకు విషం ఉండదు. తాచుపాము, కట్లపాము, రక్త పింజర, పాడ పాము వంటి 15 సర్ప జాతులు ప్రమాదకరమైనవి. పాము కాటువేస్తే మంత్రాలు, నాటు వైద్యం అంటూ ఆలస్యం చేయకుండా, వెంటనే సమీప ఆసుపత్రికి తీసుకు వెళ్లాలి. పాము కాటుకు గురైన వ్యక్తిని ఎట్టి పరిస్థితిల్లోనూ నడిపించకూడదు. సాధ్యమైనంత వరకూ ఎత్తుకుని వాహనంలో కుర్చోబెట్టుకుని తీసుకెళ్లాలి. పాము కాటు వేసిన ప్రదేశం పైభాగంలో రక్త ప్రసరణ జరగకుండా బలంగా కట్టుకట్టాలి. అప్పుడు విషం విరుగుడు ఇంజక్షన్ త్వరగా పని చేస్తుంది.

> **యాంటీ స్నేక్ వీనం ఇంజక్షన్ ఇప్పించాలి**
>
> 
>
> ప్రతి ప్రభుత్వాసుపత్రిలోనూ యాంటీ స్నేక్ వీనమ్ ఇంజక్షన్ అందుబాటులో ఉంటాయి. తాచు పాము, రక్తపింజర వంటి విషం ఉన్న పాములు కరిస్తే రెండు గాట్లు పడతాయి. ఈ పాములు కాటు వేయగానే దంతాల ద్వారా కోరల్లోకి విషం వచ్చి గాట్ల ద్వారా శరీరంలోకి విషం ప్రవేశిస్తుంది. విషానికి విరుగుడు ఇవ్వాలి. సాధారణంగా 99 శాతం పాముల్లో విషం ఉండదు. పాము కరచిన వ్యక్తిని ధైర్యం చెప్పి వాహనంలో వైద్యుని దగ్గరకు తీసుకు వచ్చి యాంటీ స్నేక్ వీనమ్ ఇంజక్షన్ ఇప్పించాలి.
>
> –డాక్టర్ ఎ.సంధ్య, డిప్యూటీ వైద్య, ఆరోగ్యశాఖాధికారి, కొవ్వూరు

పీహెచ్‌సీ వద్ద ఆశా కార్యకర్తల ఆందోళన



పోతవరం పీహెచ్‌సీ వద్ద ఆందోళన చేస్తున్న ఆశా కార్యకర్తలు

నల్లజర్ల: మండలంలోని పోతవరం పీహెచ్‌సీ వద్ద ఆశా కార్యకర్తల చేపట్టిన ఆందోళన మంగళవారం 11వ రోజుకు చేరింది. ఆశా వర్కర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు పోశమ్మ ఈ ఆందోళనకు నాయకత్వం వహిస్తున్నారు. సచివాలయం–2లో పని చేస్తున్న ఏఎన్ఎం దుర్గాదేవి తన వద్ద పనిచేసే ఆశా కార్యకర్తలు లక్ష్మి, ప్రమీల, దుర్గలను మానసికంగా వేధించిందనేది ఆరోపణ. దుర్గాదేవిపై చర్యలు తీసుకోవాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేక పోవడంతో ఆశా కార్యకర్తలు మంగళవారం పీహెచ్‌సీ వద్ద వంటా వార్పు కార్యక్రమం చేపట్టి ఆందోళనకు దిగారు. కాగా వార్షిక తనిఖీ నిమిత్తం పోతవరం పీహెచ్‌సీకి వచ్చిన డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటేశ్వరరావు దృష్టికి ఏఎన్ఎంలు ఈ విషయాన్ని తీసుకెళ్లారు. ఈ ఆరోపణలపై ఇప్పటికే శాఖాపరమైన విచారణ జరిగిందని, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన వారికి బదులిచ్చారు. సంబంధిత ఫైల్‌ను అడిషనల్ డీఎంహెచ్ఓ తమకు పంపాల్సి ఉందన్నారు. తదనంతరం తగిన చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను డాక్టర్‌తో సహా సిబ్బంది ఎంత వరకూ పూర్తి చేస్తున్నారనే విషయాలను పరిశీలించినట్టు చెప్పారు.

అల్లుకుపోయిన డెక్కతో అన్నదాతకు చిక్కులు



అన్నదేవరపేట వద్ద కొవ్వాడ కాలువలో పేరుకుపోయిన గుర్రపు డెక్క, తూడు



పెద్దేవం గ్రామంలోని సుగంధి చెరువులో అల్లుకున్న గుర్రపు డెక్క

తాళ్లపూడి: గుర్రపు డెక్క రైతుల పాలిట శాపంగా మారుతోంది. మండలంలోని కొవ్వాడ కాలువలోని పలు ప్రాంతాల్లో, చెరువుల్లో గుర్రపు డెక్క పేరుకు పోయి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారుతుంది. దీంతో వర్షాకాలంలో పంటలను నష్ట పోతున్నామంటూ రైతులు వాపోతున్నారు. ముఖ్యంగా మండలంలోని రాగోలపల్లి నుంచి గజ్జరం, అన్నదేవరపేట వరకూ కొవ్వాడ కాలువ సుమారు ఆరు కిలోమీటర్ల పొడువునా విస్తరించి ఉంది. ఈ కాలువలో గుర్రపు డెక్క విపరీతంగా పెరిగి పోయింది. పెరిగిపోయిన ఈ గుర్రపు డెక్క వల్ల ఏటా వర్షాకాలంలో ఎగువ ప్రాంతం నుంచి కొవ్వాడ కాల్వలో చేరిన నీరు దిగువకు ప్రవహించకుండా పొలాలను ముంచెత్తుతోంది. ఫలితంగా రైతులు నష్టపోతున్నారు. అలాగే పెద్దేవం గ్రామంలోని సుగంధి చెరువు కూడా గుర్రపు డెక్కతో నిండిపోయి నిరుపయోగంగా మారింది. ఈ చెరువు విష సర్పాలకు నెలవుగా మారింది.

గతంలో ఉపాధి హామీ పథకం కింద గుర్రపు డెక్క తొలగింపు పనులు చేపట్టేవారు. ప్రస్తుతం ఈ పనిని ఉపాధి హామీ పనుల్లోంచి తొలగించారు. కాలువ, చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్కన తొలగింపుపై అధికారులు దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

‘నేను బడికి పోతా’ అవగాహన ర్యాలీ



గోపాలపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

గోపాలపురం: ‘ప్రైవేట్ పాఠశాలలు వద్దు .. ప్రభుత్వ పాఠశాలలు ముద్దు’ అంటూ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ‘నేను బడికిపోతా’ కార్యక్రమంలో భాగంగా గోపాలపురంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు మంగళవారం అవగాహనా ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ జి. శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం సమకూర్చే ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, నోట్‌బుక్స్, షూ, బెల్టు, బూట్లు, సాక్స్ బ్యాగ్‌లను విద్యార్థులకు అందజేస్తామన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో కాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని 6 నుంచి 14 సంవత్సరాల వయసున్న బాలబాలికలందరినీ పాఠశాలల్లో చేర్పించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. అనంతరం విభిన్న ప్రతిభావంతురాలైన ఎర్రాలు సాయి మహిత అనే బాలికను 6వ తరగతిలో చేర్పించారు. కార్యక్రమంలో ఎ.మహేశ్వరరావు, టి.రాజేష్‌బాబు, నాగరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు తొలి విడత పెట్టుబడి సాయం విడుదల

కొవ్వూరు: ఖరీఫ్ పెట్టుబడి సాయం కింద కేంద్ర ప్రభుత్వం తొలి విడతగా ఒక్కో రైతు ఖాతాకు రూ.2 వేల చొప్పున పీఎం సమ్మాన్ కిసాన్ నిధులను జమ చేసినట్టు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రకటించారు. కొవ్వూరులో మంగళవారం ఆయన వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష జరిపారు.అనంతరం విలేకరులతో మాట్లాడారు. టీడీపీ నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బారాయచౌదరి, కంఠమణి రామకృష్ణ, మునిసిపల్ మాజీ చైర్మన్ సూరపనేని చిన్ని, ఎంపీపీ కాకర్ల నారాయుడు, అర్బన్ బ్యాంక్ చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, వ్యవసాయ శాఖ ఏడీ పి.చంద్రశేఖర్, బీజేపీ నాయకులు పిల్లలమర్రి మురళీకృష్ణ, బీవీ ముత్యాలరావు, జనసేన నాయకుడు డేగల రాము తదితరులు పాల్గొన్నారు.

కుట్టు, మగ్గం శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం సిటీ: స్వర్ణాంధ్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో మగ్గం, టైలరింగ్ కోర్సులలో శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్వర్ణాంధ్ర సేవాసంస్థ నిర్వాహకుడు డాక్టర్ గుబ్బల రాంబాబు తెలిపారు. శిక్షణ తరగతులు ఈ నెల 24 నుంచి ప్రారంభమవుతాయన్నారు. 45 రోజుల పాటు జరిగే శిక్షణలో మెటీరియల్, మధ్యాహ్న భోజనం ఉచితంగా అందించడంతో పాటు శిక్షణ అనంతరం ఉత్తీర్ణత పత్రాలను ప్రదానం చేస్తామన్నారు. ఆసక్తి కలవారు 98498 47489, 94907 10850 నంబర్లను సంప్రదించాలన్నారు. లేకపోతే లాలా చెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమానికి రావాలని కోరారు.

పాలంగిలో ఆభరణాలు, నగదు చోరీ

ఉండ్రాజవరం: మండలంలోని పాలంగి గ్రామంలోని ఒక ఇంట్లో సోమవారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం పాలంగి ఎన్టీఆర్ విగ్రహం ఎదురుగా గల ఇంట్లో కొమ్మర విజయకుమార్, ఆశా నీలిమ దంపతులు తమ ఇద్దరు పిల్లలతో నివాసం ఉంటున్నారు. పని మీద విజయ్‌కుమార్ హైదరాబాద్ వెళ్లగా, నీలిమ మండలంలోని చిలకపాడులోని తన పుట్టింటికి వెళ్లింది. మంగళవారం తెల్లవారుజామున ఇంటి తాళం తెరచి ఉండడాన్ని గమనించిన స్థానికులు అనుమానం వచ్చి నీలిమకు సమాచారం అందించారు. ఆమె వచ్చి చూసుకున్నాక ఇంట్లో దొంగతనం జరిగినట్టు నిర్ధారణ చేసుకున్నారు. దుండగులు రూ.60 వేల నగదు, 14.5 గ్రాముల బంగారు ఆభరణాలు, 20 తులాల వెండి పట్టాలు అపహరణకు గురైనట్టు నీలిమ తెలిపారు. ఈచోరిపై ఉండ్రాజవరం పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఆమె తెలిపింది.

ఇరిగేషన్ కాలువలోకి డ్రైనేజీ సిల్ట్ డంపింగ్ !

కడియం: జనావాసాల మధ్య మురుగు కాలువల నుంచి తీసిన సిల్ట్‌ను కడియపులంక పంచాయతీ పరిధిలోని ఇరిగేషన్ కాలువలో డంపింగ్ చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వర్షాకాలం నేపథ్యంలో ముంపు నివారణా జాగ్రత్త చర్యల్లో భాగంగా కడియపులంక పంచాయతీ పరిధిలోని కడియపులంక, బుర్రిలంక గ్రామాల్లోని మురుగు కాలువల్లో సిల్ట్ తొలగింపు పనులు చేపట్టారు. తీసిన సిల్ట్‌ను డంపింగ్ యార్డులకు తరలించాల్సి ఉంది. అయితే అందుకు విరుద్ధంగా కోటిపల్లి సాగునీటి కాలువ వెంబడి పోస్తున్నారు. దీంతో సాగునీటిలో సిల్ట్ కలిసిపోవడంతో పశువులు సైతం ఆ నీటిని తాగడం లేదని తెలిపారు. విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

దమ్ము చక్రాలతో రోడ్లు ధ్వంసం



చాగల్లు శివార్లలో దమ్ము చక్రాలతో రోడ్డుపైకి వచ్చిన ట్రాక్టర్

చాగల్లు: దమ్ము చక్రాలతో ట్రాక్టర్లు యథేచ్ఛగా తిరుగుతుండడంతో మండలంలోని రోడ్లు ఛిద్రమవుతున్నాయి. రోడ్ల నిర్మాణంలో రానురానూ నాణ్యతా ప్రమాణాలు దిగజారుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఇనుప చక్రాలకు బద్దెలు లేకుండా ట్రాక్టర్ల రాకపోకలు సాగించడంతో రోడ్లు అధ్వానంగా తయారవుతున్నాయి. దీనిపై గ్రామాల్లో సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి దమ్ము చక్రాలు బిగించిన ట్రాక్టర్లు రోడ్లపై తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. కేవలం కొందరు తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో రూ.లక్షల ఖర్చుతో వేసిన రహదారులు ధ్వంసం అవుతున్నాయి. ట్రాక్టర్ల నిర్వాహకులు నిబంధనలు పాటించకపోవడం వల్ల ఈ దుస్థితి ఏర్పడుతోందని పలువురు పేర్కొంటున్నారు. దమ్ము చక్రాలకు కచ్చితంగా బద్దెలు అమర్చుకోవాలి. లేదా పొలంలోకి వెళ్లిన తరువాత దమ్ము చక్రాలను బిగించుకోవాలి. ఊనగట్ల, కుంకుడుమిల్లి రోడ్డు, ఊనగట్ల– అమ్మిగుంట రోడ్డు, చాగల్లు– నందమూరు రోడ్డు, దారవరం– మార్కొండపాడు, చాగల్లు– కాపవరం రోడ్లు ధ్వంసమవుతున్నాయి. గ్రామాల్లోని పలు సీసీ రోడ్లు, గ్రావెల్ రోడ్లు కూడా దెబ్బతింటున్నాయి. అధికారులు ఇకనైనా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నగదు బ్యాగ్ తీసుకుని పరార్

కొవ్వూరు: పట్టణానికి చెందిన జక్కా శ్రీను అనే కిరాణా వ్యాపారి సోమవారం రాత్రి 11 గంటల సమయంలో వ్యాపారం ముగించుకుని ఇంటికి నడిచి వెళుతున్నాడు. షడన్‌గా గుర్తుతెలియని వ్యక్తి వెనుక నుంచి వచ్చి శ్రీను చేతలోని నగదు బ్యాగ్‌ను లాక్కొని పరారయ్యాడు. ఆ బ్యాగులో రూ.లక్ష మేర సొమ్ము ఉన్నట్టు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ బాబురావు తెలిపారు.

రెండు ఇళ్లలో బంగారం, నగదు చోరీ

రాజానగరం: నియోజకవర్గ కేంద్రంగా ఉన్న రాజానగరంలో చోరీలు పెరిగిపోతున్నాయి. తాళం వేసి ఉన్న ఇళ్లను దొంగలు టార్గెట్ చేస్తున్నారు. వైఎస్సార్ జంక్షన్‌లోని కాలనీలో రెండు రోజుల క్రితం రెండు ఇళ్లలో దొంగతనాలు జరిగాయి. కాలనీలో నివాసం ఉంటున్న కె.కీర్తన ఇంటికి తాళం వేసుకుని పొరుగూరు వెళ్లింది. దొంగలు ఆదివారం రాత్రి ఆ ఇంటి తాళాన్ని పగలుకొట్టి లోపలకు ప్రవేశించారు. బీరువాలోని 60 గ్రాముల బంగారు నగలు, రూ. 26 వేలు అపహరించుకుపోయారు. అదే ప్రాంతంలో ఉంటున్న కె.రఘువంశరెడ్డి కూడా కుటుంబ సమేతంగా ఊరెళ్లాడు. అయితే స్థానికులు అతడికి ఫోన్ చేసి మీ ఇంటి తలుపులు తెరచి ఉన్నాయని చెప్పడంతో హుటాహుటిన వచ్చాడు. దొంగలు ఆ ఇంటి తలుపులను పగులకొట్టి బీరువాలోని నాలుగు కాసులు బంగారు నగలు, వెండి పూజా సామగ్రి, రూ.50 వేలు దోచుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నీటి వృథా.. ఆగేదెలా..

- పైపులైన్ల లీకేజీలతో అవస్థలు
- వృథాగా పోతున్న సురక్షిత నీరు
- పట్టించుకోని అధికారులు



బొమ్మూరు శృతి హాస్పిటల్ వద్ద పైపులైన్ మరమ్మతుల కోసం తీసిన గొయ్యి

రాజమహేంద్రవరం రూరల్: సురక్షిత తాగు నీరు ప్రజలందరికీ సక్రమంగా అందాలంటే పైపు లైన్లు బాగుండడం ఎంతో కీలకం. అవి సక్రమంగా ఉన్నప్పుడే నీరు అందరికీ అందుతుంది. అయితే పైపులైన్ల లీకేజీల కారణంగా తాగు నీరు వృథాగా పోతోంది. వేసవి నేపథ్యంలో నీటిని చాలా పొదుపుగా వాడుకోవడం అవసరం. కానీ లీకేజీల కారణంగా నీరంతా వృథాగా పోతోంది. సుమారు నెల రోజుల నుంచీ ఈ సమస్య ఉన్నా అధికారులు స్పందించడం లేదు.

పలుచోట్ల లీకేజీలు

బొమ్మూరు వెంకటగిరికొండపై 22 ఎంఎల్‌డీ దివంగత మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు సురక్షిత మంచినీటి పథకాన్ని నిర్మించారు. దీని ద్వారా కడియం, రాజమహేంద్రవరం రూరల్, రాజానగరం మండలాలలోని గ్రామాలకు నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే ఇటీవల ఈ పథకం పైపులైన్లకు పలుచోట్ల లీకేజీలు ఏర్పడ్డాయి. దీంతో నీరంతా నేలపాలవుతోంది.

- బొమ్మూరులోని శృతి హాస్పిటల్ వద్ద మంచినీటి పైపులైన్‌కు లీకేజీ ఏర్పడి దాదాపు రెండు నెలలైంది. దానికి ఇప్పటివరకూ పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టలేదు. ప్రతి రోజూ బొమ్మూరు గ్రామ పంచాయతీ సిబ్బంది గోతులోని నీటిని తోడాల్సిన పరిస్థితి నెలకొంది. సాధారణంగా భారీగా వర్షం కురిస్తే ఆ ప్రాంతం మునిగిపోతుంది. అప్పుడు నీరు రోడ్డుపైకి చేరితే, వాహన చోదకులు ఆ గొయ్యిలో పడే ప్రమాదం ఉంది.
- హుకుంపేట జాతీయ రహదారి పక్కన చెరుకూరి గోడౌన్స్ వద్ద పైపులైన్ లీకేజీ ఏర్పడి తాగునీరు వృథాగా పోతోంది. కొద్ది రోజులుగా ఇదే పరిస్థితి నెలకొనడంతో ఆ ప్రాంతం బురదమయంగా మారింది. ప్రతి రోజు మంచినీరు వదిలే సమయంలో ఈ పరిస్థితి ఏర్పడుతోంది.
- బొమ్మూరు వెంకటగిరి కొండ సమీపంలోని ఎంఆర్‌టీ ఆఫీసు వద్ద తాగునీటి వాల్వ్ సరిగ్గా పనిచేయడం లేదు. దీనివల్ల వాటర్ ట్యాంకుల వెళ్లే మంచినీరు వృథా అవుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరలోనే లబ్ధిదారులకు టిడ్కో గృహాలు

- ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు
- అసంపూర్తి ఇళ్ల పరిశీలన

కొవ్వూరు: సాధ్యమైనంత త్వరలో అసంపూర్తి నిర్మాణాలను పూర్తి చేసి పట్టణంలోని టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందజేస్తామని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రకటించారు. అధికారులు, టీడీపీ నాయకులతో కలసి మంగళవారం పట్టణంలోని టిడ్కో గృహాలను ఆయన పరిశీలించారు. 2019–14లో పట్టణ పేదలందరికీ టిడ్కో గృహాలు అందించారు. సింగిల్ బెడ్ రూమ్ ప్లాట్స్ 240, డబుల్ బెడ్‌రూమ్స్ ప్లాట్స్ 240 నిర్మించామన్నారు. ఇప్పటికే ఎనభై శాతం పూర్తయిన ఇళ్ల నిర్మాణ పనులను మూడు, నాలుగు నెలల్లోగా పూర్తి చేయించి లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. లబ్ధిదారుల నివాసానికి అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలూ కల్పిస్తామని చెప్పారు. టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బారాయచౌదరి, కంఠమణి రామకృష్ణ, ఎంపీపీ కాకర్ల నారాయుడు, మద్దిపట్ల శివరామకృష్ణ, బీవీ ముత్యాలరావు, డేగల రాము, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.